క్లుప్తంగా

వాల్టా చట్టానికి తూట్లు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: ప్రభుత్వ నిబంధనలు తుంగలోకి తొక్కడమేనా సుపరిపాలన అని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండలంలోని గుషిణి గ్రామంలో ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన..గుషిణి గ్రామ రెవెన్యూ పరిధిలో 1.75 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది టీడీపీ సానుభూతిపరులు ఆక్రమించారని ఆరోపించారు. అధికారులు సర్వే చేసి ప్రభుత్వ భూమిగా నిర్ధారించి హెచ్చరిక బోర్డులు పెట్టినా వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ ఆ భూమిలో వ్యవసాయ బోర్లు తవ్వి అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు కూడా పెట్టారన్నారు. ఆ విద్యుత్ అక్రమ కనెక్షన్లను తొలగించాలని విద్యుత్ శాఖ ఆదేశాలు ఇచ్చినప్పటికీ స్థానిక అధికారులు నేటికీ చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లా పర్యటనకు విచ్చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ అయినా దీనిపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలన్నారు.

వాహన తనిఖీలు



తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ రవి

విజయనగరం క్రైమ్: నగరంలోని మయూరి జంక్షన్, రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, బాలాజీ కూడలి, దాసన్నపేట జంక్షన్‌లలో పోలీసులు వాహన తనిఖీలు ఆదివారం చేపట్టారు. ట్రాఫిక్ ఎస్‌ఐలు రవి, భాస్కరరావులు సిబ్బందితో కలిసి అటువైపుగా వస్తున్న వాహనదారులను ఆపి, వారి డ్రైవింగ్ లైసెన్స్ సహా వాహన ధ్రువపత్రాలు, పెండింగ్ చలాన్లు పరిశీలించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద చేపట్టిన తనిఖీల్లో దాదాపు 50కి పైగా వాహనదారులను ఆపి, పెండింగ్ చలాన్లను ఎస్‌ఐ రవి కట్టించారు.

ఎరువుల షాపుల్లో ఆకస్మిక తనిఖీలు



ఎరువుల స్టాక్ రికార్డులు పరిశీలిస్తున్న ఏవో హైమావతి

భోగాపురం: మండల కేంద్రంలోని పలు ఎరువుల షాపుల్లో ఏవో హైమావతి ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ఎరువులు గానీ విత్తనాలు గానీ విక్రయించాలని ఆమె సూచించారు. ఎవరైనా నాసిరకం ఎరువులు విక్రయించినట్లు తెలిసినా, కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినా, అధిక ధరకు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం ప్రైవేటు డీలర్ల వద్ద 22 మెట్రిక్ టన్నులు, సొసైటీల్లో 36 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అవసరం మేర మాత్రమే రైతులు తీసుకోవాలన్నారు.

సురక్షితమైన వైద్యసేవలు అందించాలి



మాట్లాడుతున్న వీఎస్ ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: ప్రజలకు సురక్షితమైన వైద్యసేవలు అందించాలని ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) సీజీపీ హెడ్ క్వార్టర్ డీన్ డాక్టర్ వీఎస్ ప్రసాద్ సూచించారు. ఆదివారం కర్నూలు జిల్లా, నంద్యాలలో ఐఎంఏ ఆధ్వర్యంలో జరిగిన వైద్యుల సమ్మేళనంలో ఆయన పాల్గొని, అధునాత వైద్య విధానాలు–సాంకేతిక పరిజ్ఞానంపై కాసేపు మాట్లాడారు. సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, ప్రజలకు సులభతరమైన సత్వర వైద్యసేవలు సకాలంలో అందేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ చంద్రశేఖర్, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యకు డాక్టరేట్..

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం గ్రామానికి చెందిన ముదునూరు సౌమ్య గీతం యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందింది. ఈ మేరకు విశాఖపట్నం ఎంపీ, గీతం యూనివర్సిటీ యాజమాన్య ప్రతినిధి ఎం.భరత్, బోస్ సంస్థ ఉపాధ్యక్షుడు ఎస్.నారాయణ్ యూనివర్సిటీలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో సౌమ్యకు డాక్టరేట్ పట్టా అందజేశారు. రసాయన శాస్త్రంలో ఐరన్ ఆక్సైడ్‌తో కూడిన నానో కణాలు, పారా ఆల్కాక్సిబెంజాయిక్ ఆమ్లా ద్రవ స్ఫటికలు – సంశ్లేషణ, తదితరాలపై చేసిన పరిశోధనలకు గాను సౌమ్యకు డాక్టరేట్ లభించింది.

మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో కార్పొరేషన్ డిప్యూటీ మేయరు కోలగట్ల శ్రావణి



ఫంక్షన్ హాల్‌లో జరిగిన సభలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయరు శ్రావణి



ఐదో డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

విజయనగరం: ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని, ఎంతటి వారినైనా ఆయన తన మాయమాటలతో వంచించగలడని మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయరు కోలగట్ల శ్రావణి విమర్శించారు. నగరంలోని 5, 9, 29వ డివిజన్లలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమెకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఆమె అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. అలాగే గతంలోని వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి ప్రభుత్వ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను తెలిపారు. ఆ తర్వాత 29వ డివిజన్‌లోని సుజాత ఫంక్షన్ హాల్‌లో జరిగిన సభలో కూటమి కుతంత్రాలు, కుయుక్త రాజకీయాలను ఎండగట్టారు. ఎన్నికల సమయంలో అధికారం కోసం అమలు సాధ్యం కాని హామీలిచ్చి ఇప్పుడు అవే హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసే ప్రయత్నం కూటమి చేస్తోందని ధ్వజమెత్తారు. గద్దెనెక్కి 14 నెలలైనా అరకొరగా ఒకట్రెండు పథకాలు మాత్రమే ఇచ్చి మిగతా పథకాలు ఇవ్వకుండా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుండడం దుర్మార్గమన్నారు. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు ఆడబిడ్డ నిధి పథకం అమలుపై ప్రజలు అడిగిన ప్రశ్నకు అది ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్ముకోవాలన్న ఆయన సమాధానం వెనక రహస్యమేంటన్నారు. మిగతా పథకాలు ఇవ్వలేమని పరోక్షంగా చెప్పడం కాదా అని నిలదీశారు. చాలా మందికి గ్యాస్, తల్లికి వందనం పథకం డబ్బులు పడలేదన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఇలా కాదని, అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా జరిగిందన్నారు. ప్రతి వర్గానికి మేలు జరిగేలా పథకం రూపొందించి, అందివ్వడం జరిగిందన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకతీతంగా పథకాలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పుడు రాష్ట్ర ఖజానా లేదనే సాకుతో పథకాలు ఇవ్వకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఇచ్చినంతవరకు ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తూనే ఉంటుందన్నారు.

ఏడాదిలో చేసిన అభివృద్ధేది?

బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఐదో డివిజన్‌లో కార్పొరేటర్ గాదం మురళీ ఆధ్వర్యంలో పర్యటించిన పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడులు కూటమి ఏడాది పాలనలో ప్రజలకు జరిగిన మోసాన్ని ఇంటింటికీ వెళ్లి తెలిపారు. కూటమి అధికారం చేపట్టిన నాటి నుంచి అబద్ధాలు, మోసాలతోనే పాలన కొనసాగుతోందని విమర్శించారు. ఇప్పటివరకు వారి హయాంలో విజయనగరంలో జరిగిన అభివృద్ధి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి పాలనలో అభివృద్ధి లేదు..సంక్షేమమూ లేదన్నారు. వైఎస్సార్ సీపీ బాధ్యత గల ప్రతిపక్షంగా ప్రజల తరఫున నిలిచి పోరాటం చేయడం వల్లే ఆ ఒకట్రెండు పథకాలు(గ్యాస్, తల్లికి వందనం) పథకాలైనా కొంతమందికి ఇచ్చారన్నారు. మిగతా పథకాలు ఎప్పుడిస్తారని జనమంతా ఎదురుచూస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని అంతవరకు వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదన్నారు. అనంతరం ఆయా డివిజన్‌ల్లో జరిగిన సభల అనంతరం పార్టీ నూతన కమిటీలు ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీటి పథకం నిర్మించేదెన్నడో?



పద్మశాలి వీధి దగ్గర గతంలోని రక్షిత మంచినీటి పథకం తొలగించిన ప్రదేశం ఇదే..

పూసపాటిరేగ: మండల కేంద్రంలో నిర్మిస్తామన్న రక్షిత మంచినీటి పథకం ఎప్పుడు నిర్మిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. 8 వేలకు పైగా జనాభా కలిగిన ఈ పట్టణంలో గతంలో రెండు రక్షిత మంచినీటి పథకాలు ఉండేవి. అందులో పద్మశాలి వీధి దగ్గరున్న రక్షిత మంచినీటి పథకం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా ఉండడంతో దానిని తొలగించారు. అదే ప్రాంతంలో మళ్లీ రక్షిత మంచినీటి పథకం నిర్మిస్తామని అప్పట్లో చెప్పారు. అయినా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. దీంతో దానిపై తాగునీటికి ఆధారపడిన 4 వేల మంది జనాభా నీటి కోసం అవస్థలు పడుతున్నారు. పంచాయతీ అధికారులు మోటారు ద్వారా నీరు సరఫరా చేస్తున్నప్పటికీ సక్రమంగా సరిపడ నీరు అందడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూడి వీధి, శాలిపేట, రాజా వీధి, జాతీయ రహదారి సమీపంలోని మరికొన్ని వీధులు గత కొన్నాళ్లుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ జనాభాకు సరిపడ మంచినీటి వనరులు లేనందు వల్లే ఈ ఇబ్బందులు అని తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల బాధిత ప్రాంతాల ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా కొత్త రక్షిత మంచినీటి పథకం మంజూరు చేసి తమ దాహార్తి తీర్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సాహితీ సదస్సు

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విజయభావన సాహితీ మిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సాహితీ సదస్సులో 'త్యాగధనుడు–లక్ష్మణుడు' అనే అంశంపై ఎస్‌వీబీసీ విశ్రాంత అధికారిణి డాక్టర్ కేవీ హరిప్రియ మాట్లాడారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కందాల ఆండాళ్ పద్మప్రియ, పి.శిరీషా రఘురామ్, సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎ.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నెల్లిమర్ల: స్థానిక పట్టణంలోని ఏడో వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నగర పంచాయతీలో అభివృద్ధి పనులకు రూ.2 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఒక్కో వార్డుకు రూ.10 లక్షల చొప్పున ఆ నిధులను కేటాయించి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. పట్టణంలో నెలకొన్న పారిశుధ్యం, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ జయరాంను ఎమ్మెల్యే ఆదేశించారు.

రూ.1.33 కోట్లతో పునరావాస కేంద్రం..

పూసపాటిరేగ: మండలంలోని పతివాడ బర్రిపేటలో రూ.1.33 కోట్ల వ్యయంతో తుపాను పునరావాస కేంద్రం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మత్స్యకారుల జీవన స్థితిగతులు మెరుగుపరచడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎన్వీ రమణ, నాయకులు రఘు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు తొమ్మిది గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'

భోగాపురం: మండలంలోని తొమ్మిది గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. చాకివలస, భోగాపురం, నందిగాం, ముంజేరు, రామచంద్రపేట, చేపలకంచేరు, చెరుకుపల్లి, గుడివాడ, రాజాపులోవల్లో జరిగే ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, పార్టీ సీనియర్ నేత కందుల రఘుబాబులు హాజరై ప్రజలకు కూటమి చేస్తున్న మోసాలను వివరించనున్నారన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు



కాలువలోని మురుగు తీస్తున్న కూలీలు

పూసపాటిరేగ: మండల కేంద్రంలో పారిశుధ్య పనులు చురుగ్గా జరుగుతున్నాయి. బూడి వీధి, రాజా వీధి, యాతపేట, సాలిపేట, జాతీయ రహదారి, రజక వీధి ప్రాంతాల్లోని కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగిస్తున్నారు. అలాగే కాలువల్లో మురుగు ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తీసివేస్తున్నారు.

పీఏసీఎస్ సేవలు నిల్!

పూసపాటిరేగ: స్థానిక పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం) పరిధిలోని రైతులకు సేవలందడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ పీఏసీఎస్ పరిధిలో మొత్తం 10 వేల మంది రైతులు ఉన్నప్పటికీ ఏ ఒక్క రైతుకూ పీఏసీఎస్ పరంగా సేవలందడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. ఇప్పటివరకు ఏ రైతుకూ బ్యాంకు ద్వారా పంట రుణం మంజూరు చేయలేదని చెబుతున్నారు. అన్నదాత సుఖీభవం పథకం ద్వారా ప్రభుత్వం ఇస్తామన్న సాయం ఎలాగో రాలేదు..కనీసం పీఏసీఎస్ ద్వారా అయినా సాగుకు రుణాలు వస్తాయని ఆశిస్తున్నామని అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవీ రాకుండా పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పీఏసీఎస్ ద్వారా సేవలు అందేలా చూడాలన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌కు అభినందనలు



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మాజీ ఎంపీ ఝాన్సీలక్ష్మి

విజయనగరం అర్బన్: సీతం ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ ఎ.శివశంకర్ వరప్రసాద్‌కు ఉమ్మడి రాష్ట్ర డైరెక్టరేట్ నుంచి ప్రశంసాపత్రం రాగా ఆ విద్యార్థిని కళాశాల యాజమాన్యం, సిబ్బంది అభినందించారు. ఇటీవల అనంతపురంలో జరిగిన ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్స్–థల్ సైనిక్ క్యాంప్‌లో జరిగిన ట్రైనింగ్‌లో సదరు విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో ప్రశంసాపత్రం వచ్చినట్లు ప్రిన్సిపాల్ డీవీ రామ్మూర్తి తెలిపారు. ఆదివారం ఆ ప్రశంసాపత్రాన్ని సత్య విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి చేతులమీదుగా ఆదివారం అందజేశారు. అన్ని రంగాల్లోనూ విద్యార్థులు రాణించేలా కృషి చేయాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

'సాగు'బాటలో రైతాంగం



లక్కవరపుకోట మండలం లచ్చింపేట సమీపంలో ట్రాక్టర్‌తో దమ్ము

- ముమ్మరంగా వరి నాట్లు
- కూటమి సాయం లేకపోయినా ముందుకు 'సాగు'తున్న అన్నదాతలు
- నియోజకవర్గ పరిధిలో 16,533 హెక్టార్లలో వరి పంట సాగు




వరి నారు తీస్తున్న మహిళా రైతులు

కొత్తవలస: నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో ఖరీఫ్ వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గడిచిన పది రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు దమ్ములు ప్రారంభించారు. గత ప్రభుత్వ పాలనలో రైతు పెట్టుబడి కింద ఖరీఫ్ సీజన్ తొలి దశలోనే సహాయం అందించారు. దీంతో రైతులు రెట్టించిన ఉత్సాహంతో సాగు చేపట్టారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అన్నదాతను ఆదుకునేవారు లేకుండా పోయారు. ప్రభుత్వ సాయం లేకపోవడంతో అప్పులు తెచ్చిమరీ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. నియోజకవర్గ పరిధిలోని కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, జామి, ఎస్.కోట మండలాల్లో రైతులు ముమ్మరంగా దమ్ములు చేస్తూ బిజీబిజీగా ఉన్నారు. ప్రస్తుత ఏడాదికి సంబంధించి మండలాల వారీగా వరి సాధారణ విస్తీర్ణం విషయానికొస్తే కొత్తవలస మండలంలో 890 హెక్టార్లు.. లక్కవరపుకోటలో 3,604 హెక్టార్లు.. జామి మండలలో 5,322 హెక్టార్లు.. ఎస్.కోట మండలంలో 3,171 హెక్టార్లు.. వేపాడ మండలంలో 3,546 హెక్టార్లలో సాగు జరగనుంది. ఇదిలా ఉంటే ఇప్పటివరకు నియోజకవర్గంలో సుమారు 30 శాతానికి పైగా వరి నాట్లు పూర్తయినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కాగా రైతులకు అవసరమైన 1,607 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు భానులత తెలిపారు. దమ్ము పట్టేముందు పొలాన్ని రెండు పర్యాయాలు కలియ దున్ని మూడు రోజులు పాటు ఉంచిన తర్వాత నాట్లు వేయాలని ఆమె సూచించారు.

నగర వనం.. అందాల ఆతిథ్యం!

- రా రమ్మంటున్న సారిపల్లి నగరవనం
- తక్కువ ధరకే ఆహ్లాదకర వాతావరణంలో ఆతిథ్యం
- సందర్శకులను మైమరిపిస్తున్న నగర వనం అందాలు
- ప్రత్యేక వ్యూపాయింట్‌లు ఇక్కడి ప్రత్యేకత



సారిపల్లి నగరవనంలో సేదతీరుతున్న సందర్శకులు

సందర్శకుల సంఖ్య ఇలా..

నెల	సంఖ్య
ఏప్రిల్	260
మే	370
జూన్	475
జూలై	422
మొత్తం	1527



పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఊయలలు



మొక్కలు వివరాలు తెలిపే బోర్డులు

విజయనగరం గంటస్తంభం: ప్రజల ఆహ్లాదం కోసం నగరవనాలు, పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది..గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. నగరాలు, పట్టణాలను ఆనుకుని ఉన్న అటవీ భూముల్లో ఈ వనాల ఏర్పాటుకు కేంద్రం కొంత మేర నిధులు సమకూరుస్తోంది. దీనికి అదనంగా అప్పటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొంత నిధులు కేటాయిస్తూ వనాలను అభివృద్ధి చేసింది. అటవీ భూముల పరిరక్షణతో పాటు జనజీవనం ఆహ్లాదకర వాతావరణంలో ఉండాలన్నదే నగరవనాల ఏర్పాటు ముఖ్య ఉద్దేశం. ఈ వనాల్లో అడవులు, వన్యప్రాణుల సంరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక బోర్డులు, బొమ్మలు ఏర్పాటు చేశారు. ప్రతి వనంలోనూ వాకింగ్ ట్రాక్, క్యాంటీన్, ట్రెకింగ్, ఓపెన్ జిమ్ ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ వనాలు ఆహ్లాదకర వాతావరణంతో సందర్శకులను రా రమ్మనేలా కనువిందు చేస్తున్నాయి.

ఆత్మీయ వేడుకలకు వేదికలు..

నగర వనాల చుట్టూ పచ్చని అందాలు..పక్షుల కిలకిల రావాలు.. రాత్రి వేళ వెలుగులునిచ్చే మిణుగురులు.. ఉరుకులు, పరుగులు తీసే జంతువులు.. అంతర్గత రోడ్లు..జిమ్‌లు..ఆట పరికరాలు..వాకింగ్ ట్రాక్‌లు..వివిధ ప్రదర్శన శాలలు.. ఇలా ఒక్కటేమిటి ఆనందభోగానికి హద్దులు లేకుండా.. ఆత్మీయ వేడుకకు వేదికలయ్యేలా విరాజిల్లుతున్నాయి.. ఈ నగరవనాలు. శుభకార్యమైనా, సమావేశమైనా, కుటుంబంతో వచ్చినా స్నేహితులంతా కలిసి వెళ్లినా అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తామని చెబుతోంది అటవీ శాఖ. రండి తక్కువ ధరకే తమ అతిథ్యం పొందండని పిలుపునిస్తోంది.

నిత్యం పర్యాటకులతో సందడి..

ప్రకృతిని కాపాడేందుకు, అడవులపై అవగాహన కల్పించేందుకు కేంద్రం అన్ని రాష్ట్రాల్లో నగర వనాలను అభివృద్ధి చేస్తోంది. జిల్లాలోని సారిపల్లి, బేతనాపల్లి, కొండవెలగాడలో ఉన్న రిజర్వ్ అటవీ ప్రాంతంలో సరికొత్త నిర్మాణాలు వెలిశాయి. ఈ మేరకు రూ.6 కోట్ల మేర ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే సారిపల్లి క్షేత్రం అందుబాటులోకి రాగా మిగిలిన రెండు ప్రాంతాల్లో పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం కొన్నిరోజులుగా సారిపల్లి నగర వనం పర్యాటకులతో సందడిగా మారుతోంది. చుట్టూ ముచ్చటగొలిపేలా అడవి ఉంటుంది. వివిధ జంతువుల ప్రదర్శనతో పాటు వృద్ధులకు ఉపయోగపడేలా విశ్రాంత గదులు, యోగా మందిరం, వ్యాయామశాల, పిల్లల పార్కు ఏర్పాటు చేశారు. అటవీ జాతులతో పాటు వివిధ ప్రాంతాల్లో లభించే మొక్కలను ఇక్కడ చూడొచ్చు. రచ్చబండలు, పాకలు, ఎక్కడికక్కడే బెంచీలు ఏర్పాటు చేసి, అన్నిరకాల సదుపాయాలు సమకూర్చారు.

ధరలు ఇలా ఉన్నాయి..

నగరవనాల్లో తక్కువ ధరలకే శుభకార్యాలు, అన్నిరకాల కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చు. కార్యక్రమం చేయాలనుకునే వారు ముందుగానే నిర్వాహకులకు తెలియజేయాలి. కార్యక్రమం అనుసరించి ధర నిర్ణయిస్తారు. సాధారణంగా అయితే నగరవనం సందర్శనకు పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10 తీసుకుంటున్నారు. గత మూడు నెలల్లో 1527 మంది సందర్శించారు. టికెట్ల ద్వారా రూ.25,200 వచ్చినట్లు అటవీ అధికారుల చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



నగరవనాలు సద్వినియోగం చేసుకోవాలి. ఇక్కడికి రావడం ఓ విహారయాత్రే. కాలుష్యానికి దూరంగా రోజంతా సందడి చేయవచ్చు. ఎటువంటి ఇబ్బంది ఉండదు. సదుపాయాలు బోలెడు. 50 హెక్టార్లలో అటవీ సంపదను చూసేందుకు ప్రత్యేక వ్యూపాయింట్ కూడా ఉంది. వేసవిలో పక్షులు, వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు నీటి కుంటలు కూడా ఏర్పాటు చేశాం. 2 వేల జాతుల మొక్కలు పెంచుతున్నాం.

–ఆర్.కొండలరావు,
జిల్లా అటవీ శాఖాధికారి, విజయనగరం